క్లుప్తంగా

కనులపండువగా తొలేళ్ల ఉత్సవం



పోలమాంబ అమ్మవారు

అల్లిపురం: కొబ్బరితోట నివాసులు ఆరాధ్య దైవం పోలమాంబ అమ్మవారి వార్షిక జాతర మహోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారికి భక్తులు పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి తొలేళ్ల ఉత్సవం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఘటాల కొబ్బరి తోట, లక్ష్మీదేవిపేట, నేతాజీనగర్ ప్రాంతాల్లో తిప్పారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మంగళవారం అమ్మవారి ప్రధాన పండగ అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఉత్సవ నిర్వాహకులు తెలిపారు. ఉత్సవం సందర్భంగా అమ్మవారిని అభిషేకించేందుకు భక్తులు కలశాలతో తిరువీధి ఉత్సవం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం అమ్మవారి అలంకరణ, భక్తులకు దర్శనాలు కల్పించనున్నట్లు తెలిపారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నెంబరు 060810011006681 టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖ సిటీ: డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఆశయాల సాధనకు, దేశ ప్రగతికి నేటి యువత కృషి చేయాలని పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి పిలుపునిచ్చారు. డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ జయంతి సందర్భంగా పోలీస్ కమిషనరేట్‌లో సోమవారం ఆయన చిత్ర పటానికి సీపీ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ గొప్ప మేధావి, సంఘ సంస్కర్త, ఆర్థిక శాస్త్రవేత్త, రాజనీతిజ్ఞుడని కొనియాడారు. ఆయన అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడ్డారని గుర్తు చేశారు. ఆయన స్ఫూర్తిని త్యాగ నిరతిని, నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

ముగిసిన బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలు



బాక్సింగ్ పోటీల విజేతలతో అతిథులు, అబా సభ్యులు

కంచరపాలెం: అమెచ్యూర్ బాక్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర(అబా) 7వ రాష్ట్ర బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలు సోమవారంతో ముగిశాయి. విశాఖ బాక్సింగ్ అసోసియేషన్, నగర్ బాక్సింగ్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజులుగా కైలాసపురం మధుసూదన్ నగర్‌లో పోటీలు నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా 90 మంది బాక్సర్లు వివిధ విభాగాలు, బరువు విభాగాల్లో పాల్గొని ప్రతిభ చూపారు. ముఖ్య అతిథి ఎన్‌టీఆర్ వైద్య సేవ చైర్మన్ సుధాకర్ విజేతలకు బహుమతులు అందజేశారు. విజేత బాక్సర్లు ఈ నెల హైదరబాద్‌లో జరిగే బీఎఫ్‌ఐ నేషనల్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో అబా అధ్యక్షుడు రఘురామ్, కార్యదర్శి వాసుపల్లి అమ్మోరు, ఎన్‌పీటీఈ పోర్ట్ వర్కింగ్ అధ్యక్షుడు బి.వెంకట్, పోర్ట్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు గొర్లె చందు, రూబెన్, బి.శ్రీనివాస్, బి.కనకరాజు, టీవీఎస్ అనిల్‌కుమార్, రిఫరీలు–న్యాయమూర్తులు డాక్టర్ సునీల్, సతీష్, గణేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు అంబేడ్కర్

- భారతీయుల గుండెల్లో నిలిచిపోయే మహనీయుడు
- కలెక్టర్ హరేంధిర ప్రసాద్
- రాజ్యాంగ నిర్మాతకు ఘన నివాళులు



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, ఎమ్మెల్యే వంశీకృష్ణ



36వ వార్డు బాలల శాఖాగ్రంథాలయంలో..

డాబాగార్డెన్స్: మహిళలు, కార్మికుల హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేసిన యోధుడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ అని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. న్యాయవాదిగా, ఆర్థికవేత్తగా, రాజకీయవేత్తగా, సామాజిక సంస్కర్తగా, రాజ్యాంగ నిర్మాతగా భారతీయుల గుండెల్లో ఎప్పటికీ నిలిచిపోయే మహనీయుడని కొనియాడారు. అంబేడ్కర్ 134వ జయంతిని పురస్కరించుకొని డాబాగార్డెన్స్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి వీఎంఆర్‌డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావుతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సోషల్ వెల్ఫేర్ డీడీ రామారావు, వివిధ కుల సంఘాల



అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న జీవీఎంసీ అదనపు కమిషనర్ రమణమూర్తి తదితరులు

నాయకులు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

- జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. జీవీఎంసీ అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. భీమిలి జోనల్ కమిషనర్ ప్రేమ ప్రసన్నవాణి, డీసీఐ రిటైర్డ్ మేనేజర్ ఎస్ వరి, స్పోర్ట్స్ డైరెక్టర్ రాజు, ఏవో అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.
- రాజ్యాంగాన్ని చిత్తశుద్ధితో అమలు చేసిననాడే అంబేడ్కర్‌కు నిజమైన నావాళి అని విదసం ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బూసి వెంకట్రావు పేర్కొన్నారు. ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ ఈతలపాక సుజాత, న్యాయవాది అబ్దుల్ సలీం, సుధాకర్ పాల్గొన్నారు.
- కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద అంబేడ్కర్ జయంతి కార్యక్రమంలో ఆ పార్టీ ముఖ్య నాయకులు ఎవరూ పాల్గొనకపోవడం విశేషం. కనీసం పార్టీ కార్యాలయం గేట్లు కూడా తీయకపోవడంతో పార్టీ ఎస్సీ సెల్ నాయకుడు కస్తూరి వెంకట్రావు ఆధ్వర్యంలో ఆరుబయటే ఈ కార్యక్రమం నిర్వహించారు. ఏపీసీసీ స్పోర్ట్స్' చైర్మన్ జీవీవీఎస్ కమలాకర్ రావు పాల్గొని అంబేడ్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. బాష, అల్లిపిల్లి సతీష్, కేవీ సూర్యనారాయణ పాల్గొన్నారు.
- కేజీహెచ్‌లో వైఎస్సార్‌టీయూసీ, కేజీహెచ్ ఎస్సీ ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు నీలాపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పేదలకు పండ్లు, అల్పాహారం పంపిణీ చేశారు.అసోసియేషన్ కార్యదర్శి సూరపల్లి రాజారావు, కోశాధికారి పిలక అప్పలస్వామి, ఎస్. సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



బీజేపీకి వ్యతిరేకంగా నినదిస్తున్న విదసం

- 29వ వార్డు ఆంథోనీనగర్ స్కీం బిల్డింగ్ వద్ద నిర్వహించిన అంబేడ్కర్ జయంతి కార్యక్రమంలో ఆ వార్డు వైఎస్సార్ సీపీ నాయకుడు పీతల వాసు పాల్గొని నివాళులర్పించారు. చలపతిరావు, బుజ్జి, ఆకుల శ్యామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.
- స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థలో సంస్థ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ జహీర్ అహ్మద్, ఆంధ్ర తెలంగాణా రౌండ్ టేబుల్ సంస్థ చైర్మన్ మక్బూద్ అహ్మద్ పాల్గొని నివాళులర్పించారు.
- నగర బీజేపీ ఆధ్వర్యంలో డాబాగార్డెన్స్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు పరశురామ్ రాజు పాల్గొని నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, నాగేంద్ర, సురేంద్ర, సుహాసిని ఆనంద్ పాల్గొన్నారు.
- విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ మంజుల అంబేడ్కర్‌కు నివాళులర్పించారు.
- 36వ వార్డు రంగిరీజువీధిలోని బాలల శాఖా గ్రంథాలయంలో పునీత అన్నమా పాఠశాల తెలుగు ఉపాధ్యాయిని జయంతి, గ్రంథాలయ అధికారి పోలితల్లి అంబేడ్కర్‌కు నివాళులర్పించారు.
- ఆర్‌టీసీ జిల్లా ప్రజా రవాణా అధికారి కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా అధికారి అప్పలనాయుడు అంబేడ్కర్ విశిష్టతను వివరించారు. డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ రాజశేఖర్, డిపో మేనేజర్ గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ భవన్‌గా పాత డీసీఐ భవనం

కంచరపాలెం: పాత డీసీఐ భవనానికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్‌గా నామకరణం చేయనున్నట్లు పోర్టు అథారిటీ చైర్మన్ డాక్టర్ ఎం. అంగముత్తు ప్రకటించారు. విశాఖపట్నం పోర్టు అథారిటీ ఎస్సీ, ఎస్టీ అధికారుల సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో జ్ఞానాపురం కాన్వెంట్ కూడలిలో నిర్వహించిన కార్యక్రమంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రతిభావంతులైన పాఠశాల విద్యార్థులకు 'ఫెలోషిప్' మంజూరు చేయనున్నట్లు తెలిపారు. డిప్యూటీ చైర్మన్ దుర్గేశ్‌కుమార్ దూబే, ఐఆర్‌టీఎస్ ప్రధాన విజిలెన్స్ అధికారి పీఎస్ఎల్ స్వామి, పోర్ట్ కార్యదర్శి టి.వేణుగోపాల్, జి.ఉమమహేశ్వరరావు, రామలింగం, జి.శివరామకృష్ణ, పలువురు అధికారులు, పోర్టు ఉన్నతోద్యోగులు పాల్గొన్నారు.

జిల్లా పరిషత్‌లో..

మహారాణిపేట: జిల్లా పరిషత్ సీఈవో చాంబర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జెడ్పీ డిప్యూటీ సీఈవో కె.రాజ్‌కుమార్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో అధికారులు పీవీవీఎస్ మూర్తి (ప్లానింగ్ సెక్షన్), ఎం.మూర్తి (లీగల్ సెక్షన్), పి.సతీష్(జి.సెక్షన్) తదితరులు పాల్గొన్నారు.

అల్లిపురం: 33వ వార్డు అల్లిపురం, బోర్డు స్కూల్ దరి అంబేడ్కర్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ నాయకుడు పచ్చిరిపల్లి రాము, ఎం.రమేష్ నివాళులు అర్పించారు. వార్డు అంబేడ్కర్ సంఘం సభ్యులు పట్నాల రమణ, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

- కొబ్బరితోటలోని అంబేడ్కర్ విగ్రహానికి 34వ వార్డు నాయకుడు లింగం శ్రీనివాసరావు, ఎర్నిమ్మ దేవస్థానం చైర్మన్ లండా రమణ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. దూడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.
- భీమ్‌నగర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి కార్పొరేటర్ కందుల నాగరాజు నివాళులు అర్పించారు.
- సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ కార్యాలయంలో బ్యాంక్ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ మెంబర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో ప్రాంతీయ ప్రధానాధికారి ఏవీ రమణమూర్తి, ఏజీఎం ఏఎస్ఎన్ మూర్తి, జనరల్ సెక్రటరీ బి.రాంబాబు, ఏపీ. తెలంగాణా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ మెంబర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పాల్గొని అంబేడ్కర్‌కు నివాళులు అర్పించారు.
- డాబాగార్డెన్స్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పాకా సత్యనారాయణ పూలమాల వేసి నివాళులు అర్పించారు.



కాంగ్రెస్ కార్యాలయం వద్ద నివాళులర్పిస్తున్న కమలాకర్‌రావు



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పోర్టు అథారిటీ చైర్మన్ అంగముత్తు, ఉన్నతాధికారులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలనాయుడు



బాబాసాహెబ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నీలాపు శ్రీనివాసరావు



34వ వార్డులో నివాళులు అర్పిస్తున్న లింగం శ్రీనివాస్, లండా రమణ



నివాళులర్పిస్తున్న పరశురామరాజు, పీవీఎన్ మాధవ్, ఇతర నాయకులు



అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి సత్యనారాయణ



బాబాసాహెబ్‌కు నివాళులర్పిస్తున్న పీతల వాసు తదితరులు



నివాళులర్పిస్తున్న డాక్టర్ జహీర్ అహ్మద్



జిల్లా పరిషత్‌లో అంబేడ్కర్‌కు నివాళి అర్పిస్తున్న డిప్యూటీ సీఈవో రాజ్‌కుమార్



33వ వార్డులో నివాళులు అర్పిస్తున్న పచ్చిరిపల్లి రాము, రమేష్



అధికారులను సత్కరిస్తున్న ఏపీ, తెలంగాణ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు

అంబేడ్కర్ ఆశయాలకు భిన్నంగా మోదీ పాలన

అంబేడ్కర్ ఆశయాలకు భిన్నంగా మోదీ పాలన సాగుతోందని, ఆయన పేరు పలికే హక్కు కూడా బీజేపీకి లేదని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి ఆరోపించారు. ఎల్ఐసీ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. అంబేడ్కర్ యావత్ ప్రపంచ మానవుడని కొనియాడారు. మనువాదాన్ని భుజాలకు ఎత్తుకున్న కేంద్రంలోని బీజేపీ పాలకులకు అంబేడ్కర్ పేరు ఉచ్ఛరించే అర్హత లేదన్నారు. 'అంబేడ్కర్ పేరు పలకడం కంటే దైవనామస్మరణ చేస్తే పుణ్యమైనా వస్తుందని' రాజ్యసభ సాక్షిగా కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యల్లో అంబేడ్కర్ అంటే వారికి ఉన్న చులకన భావం వ్యక్తమవుతోందని గుర్తు చేశారు. అంబేడ్కర్ ఆశయాలకు భిన్నంగా పాలన సాగుతుందన్నారు. రాజ్యాంగాన్ని లేకుండా చేసి, మనువాద సిద్ధాంతాన్నే రాజ్యాంగంగా మార్చాలనేది బీజేపీ ఎత్తుగడగా ఉందన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు అత్తిలి విమల, సీఎస్ క్షేత్రపాల్, సమితి సభ్యులు బేగం, నాగభూషణం, దేముడమ్మ, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్‌కు నివాళులర్పించి, మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీఎస్

క్షతగాత్రులకూ పరిహారం ప్రకటించాలి

బాణసంచా బాధితులకు సీపీఎం నేతల పరామర్శ



బాధితులకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న లోకనాథం కోటేశ్వరరావు, ఎం.అప్పలరాజు

మహారాణిపేట: అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాసపట్నంలో బాణసంచా ప్రమాదంలో గాయపడి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాధితులను సోమవారం సీపీఎం కేంద్రం కమిటీ సభ్యుడు కె.లోకనాథం, అనకాపల్లి జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు పరామర్శించారు. ఈ సందర్భంగా కె.లోకనాథం మాట్లాడుతూ క్షతగాత్రులు ఆస్పత్రిలో చేరిన తరువాత పట్టించుకొనే నాథులే కరువయ్యారన్నారు. వారికి మంచినీరు, ఆహారం, ఇతర అవసరాలను కూడా ప్రభుత్వాధికారులు పట్టించుకోవడం లేదని క్షతగాత్రులు సీపీఎం బృందం వద్ద వాపోయారు. దీంతో బాధితులందరికీ సీపీఎం నాయకులు వస్త్రాలు అందజేశారు. క్షతగాత్రులు చికిత్స పొందుతున్న ప్రాంతంలో వారికి సహాయకులను ఏర్పాటు చేసి వారు పూర్తిగా కోలుకొనే వరకు ప్రభుత్వమే వారిని చూసుకోవాలని, జిల్లాలో తరుచూ ప్రమాదాలు సంభవిస్తున్నా వాటిని అరికట్టడంలో ప్రభుత్వం, అధికారులు విఫలమవుతున్నారని అన్నారు. మరణించిన కార్మికుల కుటుంబాలకు కోటి రూపాయలు పరిహారం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

మృతులకు రూ.కోటి నష్టపరిహారం ఇవ్వాలి

మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు



కేజీహెచ్‌లో బాధితులను పరామర్శించి డాక్టర్‌తో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు

మహారాణిపేట: కోటవురట్ల మండలం కైలాసపట్నంలో బాణసంచా పేలుడులో చనిపోయిన మృతుల కుటుంబాలకు కోటి రూపాయలు చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ప్రమాదంలో గాయపడి కేజీహెచ్ ప్లాస్టిక్ సర్జరీ వార్డులో చికిత్స పొందుతున్న వారిని సోమవారం ఆయన పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ ఈ ఘటన దురదృష్టకరమన్నారు. క్షతగాత్రులకు ప్రమాద తీవ్రతను బట్టి రూ.10 లక్షల నుంచి రూ.25 లక్షలు అందించాలన్నారు. అనంతరం వారికి మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించి క్షతగాత్రులను ఆదుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత



కార్యక్రమంలో పాల్గొన్న పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, హెచ్‌ఆర్‌సీ ప్రతినిధులు

సీతంపేట: రాజ్యాంగం కల్పించిన మానవ హక్కుల పరిరక్షణ అందరి బాధ్యతని, వీటిపై విద్యార్థి దశ నుంచే అవగాహన కలిగి ఉండాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. హ్యూమన్‌రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో సోమవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో హ్యూమన్ రైట్స్‌పై రూపొందించిన లఘుచిత్రాల స్క్రీనింగ్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు రూపొందించిన ఏడు లఘుచిత్రాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ మానవ హక్కుల పరిరక్షణ, వాటిపై అవగాహన కల్పిస్తున్న హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ప్రతినిధులను అభినందించారు. హ్యూమన్‌రైట్స్ కౌన్సిల్ కార్యదర్శి మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ రాజ్యాంగం ప్రసాదించిన సమానత్వపు హక్కు, స్వేచ్ఛా హక్కు, దోపిడీ నుంచి రక్షణ, మతం, భాష, సంస్కృతి కాపాడుకునే హక్కు ఉందని, వీటిని పరిరక్షించాల్సిన బాధ్యత హ్యూమన్ రైట్స్ డిఫెండర్స్‌పై ఉందన్నారు. 26 ఏళ్లగా మానవ హక్కుల పరిరక్షణకు కౌన్సిల్ కృషి చేస్తోందన్నారు.

రేషన్‌కు ఈ-కేవైసీ గండం

- ఈ నెలాఖరు వరకు గడువు
- దూరప్రాంతాలకు వెళ్లిన కూలీల ఆవేదన



ఈ కేవైసీ చేయించుకుంటున్న లబ్ధిదారులు

అల్లిపురం: రేషన్‌కు ఈ-కేవైసీ తప్పనిసరి చేయడంతో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దూర ప్రాంతాల్లో ఉన్న కూలీలు మధ్యలో రాలేక ఇబ్బంది పడుతున్నారు. సంక్షేమ పథకాల లబ్ధిదారులను తగ్గించేందుకు అనేక సర్వేలను చేస్తున్న కూటమి ప్రభుత్వం ఇప్పుడు రేషన్ కార్డుదారులను తగ్గించేందుకు చేస్తున్న కుట్రే అంటూ పలువురు ఆరోపిస్తున్నారు.

రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబాన్ని ఒక యూనిట్‌గా పరిగణించి ఈ-కేవైసీ ప్రక్రియ జరుగుతోంది. ఈ-కేవైసీ పెండింగ్ ఉన్నవారిలో ఐదేళ్ల లోపు చిన్నారులు తప్ప మిగిలిన వారందరూ తక్షణమే డీలర్లు, వీఆర్వోలు, ఎండీయూ ఆపరేటర్ల వద్ద ఈ-కేవైసీ చేయించుకోవాలని పౌరసరఫరాల శాఖ ఆదేశాలు జారీ చేసింది. దీనికోసం ఏప్రిల్ నెలాఖరు వరకు గడువు విధించింది. అయితే, ఉపాధి, విద్య , ఉద్యోగం కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు ఈ -కేవైసీ విషయంపై ఆందోళన చెందుతున్నారు. ఎక్కడ రేషన్‌కార్డు ఉందో అదే ప్రాంతానికి వచ్చి ఈ-కేవైసీ చేసుకోవాలని అధికారులు ఆదేశిస్తున్నారు. దీంతో సుదూర ప్రాంతాల్లో ఉన్నవారికి ఇబ్బంది తప్పడం లేదు. వారికి మరింత గడువు ఇవ్వాలని స్థానికంగా ఉండే కుటుంబసభ్యులు కోరుతున్నారు. మరో పక్క ఈ-కేవైసీ పూర్తి చేయాలని డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లపై అధికారులు తీవ్ర ఒత్తిడి తీసుకువస్తున్నారు.



రేషన్ బండి

ఈ-కేవైసీ పెండింగ్ తెలిసేదెలా?

కార్డుదారులకు చాలామందికి ఈ-కేవైసీ పెండింగ్‌లో ఉందన్న విషయమే తెలియదు. వారికి రేషన్ డీలర్లు చెప్పడం లేదు. సాధారణంగా ప్రతి డీలర్ ప్రతి నెలా 1 నుంచి 17వ తేదీ వరకు రేషన్ దుకాణాలు తెరిచివుంచాలి. కానీ నియోజకవర్గంలో తాము కేటాయించుకున్న రోజుల్లో మాత్రమే తెరచి ఉంచి, మిగిలిన రోజుల్లో మూసి వేస్తున్నారు. దీంతో ఈ-కేవైసీ సమాచారం తెలియడం లేదు. గతంలో కార్డులకు ఈ-కేవైసీ లేకపోయినా డీలర్లు రేషన్ పంపిణీ చేసేవారు. ప్రస్తుతం ఈ-కేవైసీ చేయించుకోని లబ్ధిదారుల జాబితాను రేషన్ డీలర్లు, సచివాలయ వీఆర్వోలకు అందజేశారు. ఈ జాబితా ప్రకారం ఐదేళ్ల నుంచి 60 ఏళ్లలోపు వారు ఈ పాస్ యంత్రాలపై వేలిముద్రలు వేసి రేషన్ డీలర్ లాగిన్‌లో ఈ-కేవైసీని పూర్తి చేయాల్సి ఉంది.

సమయం ఇవ్వాలి



రేషన్ కార్డుల్లో ఉన్నవారు అంతా ఒక్కచోట లేరు. ఉద్యోగం, చదువు నిమిత్తం బయటి ప్రాంతాల్లో ఉంటున్నారు. వారు తిరిగి రావడానికి కొంత సమయం పడుతుంది. వారికి ఈ-కేవైసీ చేయించుకునేందుకు కొంత సమయం ఇవ్వాలి.

– వాకాడ విజయమౌనికారెడ్డి, అల్లిపురం

విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సమాఖ్య సభ్యులు

మత్రిపాలెం: డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ జయంతి సందర్భంగా సోమవారం శ్రీ సింహాద్రి అప్పన్న ప్రచార సమాఖ్య ఆధ్వర్యంలో 51వ వార్డు మాధవధార ప్రధాన రహదారిలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ కళాశాల బాలికల వసతి గృహంలో అంబేడ్కర్ ఐడియాలజీపై వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు సనపల నారాయణస్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ పీతల అర్జున్ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని క్షుణ్ణంగా చదివి ఆచరణలో పెట్టే విద్యార్థులు అంబేడ్కర్ జీవిత చరిత్రను తెలుసుకున్నవారవుతారన్నారు. ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్, సనపల వరప్రసాద్, హాస్టల్ వార్డెన్ గిరీశ్వరి, ముఖ్య అతిథితో కలిసి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పోటీల్లో గెలిచిన విజేతలకు బహుమతులు అందజేశారు. సమాఖ్య సభ్యులు రమణ, సనపల ధనుంజయస్వామి తదితరులు పాల్గొన్నారు.